క్లుప్తంగా

పౌష్టికాహార కిట్ల పంపిణీ



పౌష్టికాహార వారోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న సర్పంచ్ నూకరాజు

మునగపాక (అనకాపల్లి): పౌష్టికాహార వారోత్సవాల్లో భాగంగా మునగపాక మండలంలోని వాడ్రాపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం గర్భిణీలకు, బాలింతలకు, కిశోర బాలికలకు పౌష్టికాహార కిట్లను సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ నూకరాజు మాట్లాడు తూ అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు పౌష్టికాహారం అందించడమే కాకుండా, ఈ స్థాయిలోనే చిన్నారులకు ఇంగ్లిష్ మీడియం అలవాటయ్యేలా బోధన చేస్తున్నారని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్ర సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎం, అంగన్‌వాడీ పిల్లలు, గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.

నేడు ఉచిత మెగా వైద్య శిబిరం

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహిస్తున్నట్టు అమ్మ నాన్న సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కర్రి నాగేశ్వరరావు తెలిపా రు. కేర్ హాస్పటల్స్ సహకారంతో నిర్వహించే ఈ ఉచిత మెగా మెడికల్ క్యాంప్‌లో అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తారని తెలిపారు. ఉదయం 09:30గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ నిర్వహించే వైద్య శిబిరాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

అక్రమ మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

పాయకరావుపేట : స్థానిక వై జంక్షన్ వద్ద అక్రమంగా తరలిస్తున్న మద్యం బాటిల్స్‌ను గమనించి, స్వాధీనం చేసుకొన్నట్టు ఎస్ఐ యస్.రమేష్ తెలిపారు. నక్కపల్లి మండలం, పెదతీనార్లకు చెందిన ఎం. అమ్మోరియ్య అనేవ్యక్తి మోటారు బైక్ పై 122 మద్యం బాటిళ్లు బ్యాగ్‌లో పెట్టుకొని రవాణా చేస్తుండగా గమనించడం జరిగిందన్నారు. బైక్‌ను మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, అతనిపై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు.

విజయవాడ కనకదుర్గమ్మకు పుసుపు కుంకుమల సమర్పణ



అమ్మవారి ఆలయ కమిటీ సభ్యులకు పసుపు, కుంకుమ అందజేస్తున్న రమణ

అనకాపల్లిటౌన్ : గవరపాలెంలో సతకంపట్టు శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో అక్టోబర్ 15 నుంచి దేవీనవరాత్రులు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఆలయ వ్యవస్థాపకుడు పి.వి.రమణ అన్నారు. దేవీనవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా శనివారం విజయవాడ కనకదుర్గ అమ్మవారి ఆలయ కమిటీ సభ్యులకు పసుపు, కుంకుమ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవరాత్రుల ముందుగా సుమారుగా 8 సంవత్సరాలుగా విజయవాడ కనకదుర్గ అమ్మవారికి ఆలయం తరఫున పసుపు, కుంకుమ, గాజులు, వస్త్రాలు సమర్పించడం జరుగుతుందని తెలిపారు. కమిటీ సభ్యులు పి.వెంకట అప్పారావు, సూరిశెట్టి నర్సింగరావు పాల్గొన్నారు.

మడుతూరులో నా మట్టి-నా దేశం



మడుతూరులో నా మట్టి - నా దేశం కార్యక్రమం నిర్వహిస్తున్న బీజేపీ శ్రేణులు

అచ్యుతాపుం(అనకాపల్లి) : అచ్యుతాపురం మండలంలోని మడుతూరులో శనివారం నా మట్టి–నా దేశం కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గ బీజేపీ ఇన్‌ఛార్జ్ రాజాన సన్యాసి నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పార్లమెంటు పక్కన ఏర్పాటు చేసే ఉద్యానవనంలో దేశంలో అన్ని ప్రాంతాల నుంచి సేకరించిన మట్టిని వేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మేరుగు కాసుబాబు,పల్లె రాజా బాబు, తిమ్మాపాత్రుని గోవింద, శనివాడ రాంబాబు, మల్ల శ్రీను, కరణం శ్రీను, బండారు ప్రసాద్, తురాయి శ్రీరాములు, జోగినాయుడు పాల్గొన్నారు.

తప్పు చేస్తే శిక్ష పడాల్సిందే...

- చట్టానికి ఎవరూ అతీతులు కారు
- స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసులో చంద్రబాబు అరెస్టును స్వాగతించిన జనం
- టీడీపీ ఆందోళనలపై విమర్శలు

ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ స్కీములో జరిగిన కుంభకోణానికి సంబంధించి అన్ని ఆధారాలతోనే సీఐడీ చంద్రబాబును అరెస్టు చేసిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. చట్టానికి ఎవరూ అతీతులు కారని, చంద్రబాబునాయుడికి చట్టాలపై గౌరవం ఉంటే తనపై వచ్చిన ఆరోపణలను, నమోదయిన కేసులను న్యాయ పరంగా ఎదుర్కొని తన నిజాయితీని నిరూపించుకోవాలని వివిధ వర్గాలవారు అంటున్నారు. చంద్రబాబు హయాంలో జరిగిన అవినీతిని పూర్తిగా వెలుగులోకి తీసుకొచ్చి కఠినంగా శిక్షించాలని కోరుతున్నారు. – నక్కపల్లి

అప్పట్లోనే కుంభకోణం వెలుగులోకి...



చట్టం దృష్టిలో అందరూ సమానమే. తప్పు చేయనపుడు చంద్రబాబు భయపడాల్సిన అవసరం లేదు. న్యాయస్థానం ద్వారా తన నిజాయితీ నిరూపించుకోవాలి. తప్పు లేనప్పుడు ధర్నాలు, రాస్తారోకోలు ఎందుకు చేయాలి. స్కిల్ డెవలప్‌మెంట్ స్కీములో కుంభకోణం జరిగిందని రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారం జరిగింది. డొల్ల కంపెనీలు పెట్టి కోట్లాది రూపాయలు స్వాహా చేశారన్న ప్రచారం అప్పట్లో జరిగింది. చంద్రబాబు హయాంలోనే ఇది వెలుగులోకి వచ్చింది. అప్పట్లోనే తన నిజాయితీ నిరూపించుకుని ఉండాల్సింది. గతంలో జగన్‌ను అరెస్ట్ చేస్తే 16 నెలలు జైల్లో ఉన్నారు. తర్వాత బెయిల్‌పై విడుదలై, న్యాయ పోరాటం చేస్తున్నారు. చంద్రబాబు కూడా ఇదే పరిస్థితిని ఎదుర్కోవాలి. అరెస్టు చేయడాన్ని తప్పు పట్టడం లేదు. ముందస్తు నోటీసు ఇచ్చి అరెస్టు చేసి ఉంటే బాగుండేది.

– తోట నగేష్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్

కేసులు ఎదుర్కోక తప్పదు



స్కిల్ డెవలప్‌మెంట్ స్కీములో కుంభకోణం జరిగింది. ఈ విషయం అందరికి తెలుసు. తప్పు జరగకుండా 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా చేసిన వ్యక్తిని ఎందుకు అరెస్టు చేస్తారు. ఈ కుంభకోణంలో చంద్రబాబునాయుడు తన ప్రమేయం లేకపోతే న్యాయ పోరాటం చేసి తన నిజాయితీ నిరూపించుకోవాలి. కేవలం ఆరోపణలతో సీబీఐ కేసులు పెట్టడం వల్లే గతంలో జగన్‌మోహన్‌రెడ్డి 16 నెలలు జైలులో ఉన్నారు. తర్వాత బెయిల్‌పై విడుదలయ్యారు. చట్టానికి ఎవరూ అతీతులు కారు. నాలుగేళ్లక్రితమే ఈ కుంభకోణం వెలుగులోకి వచ్చింది. సీబీఐ, సీఐడీ దృష్టిలో అందరూ సమానమే. తప్పు చేసిన వారు ఏ స్థాయిలో ఉన్న కేసులు నమోదు చేసి అరెస్టు చేయడమే వారి విధి.

– జగతా శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి

రాజకీయ కక్ష అనలేం



సబీఐ, సీఐడీలు అనేవి స్వతంత్ర ప్రతిపత్తిగల సంస్థలు, అన్ని కోణాల్లోను విచారణ చేసి ఆధారాలు సేకరించిన తర్వాతే ఏ స్థాయి వ్యక్తులనైనా అరెస్టు చేస్తాయి. చంద్రబాబు విషయంలో ఇదే జరిగింది. ఈ విషయంలో చట్టం పని చట్టం చేస్తుంది. చంద్రబాబుకు దమ్ముంటే తాను తప్పు చేయలేదని నిరూపించుకోవాలి. దీన్ని రాజకీయ కోణంలో చూడాల్సిన అవసరం లేదు. – కంబాల అమ్మోరయ్య, మత్స్యకార నాయకుడు

జెడ్పీ నిధులతో 11 అభివృద్ధి పనులకు ఆమోదం

రూ.26 లక్షల మంజూరు

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలో జిల్లా పరిషత్ నిధుల నుంచి 11 అభివృద్ధి పనులకు 26 లక్షల రూపాయలు నిధులు మంజూరయ్యాయి. జెడ్పీటీసీ లాలం రాంబాబు సిఫారసు చేసిన నాలుగు పనులు, కో ఆప్షన్ జెడ్పీ సభ్యుడు నర్మాల కుమార్ సిఫారసు చేసిన 7 పనులకు నిధులు మంజూరయ్యాయి

మంజూరైన నిధులిలా..

కో ఆప్షన్ జెడ్పీ సభ్యులు కుమార్ కోటాలో..ఇరువాడ శ్మశానవాటిలో మౌలిక సదుపాయాల కల్పనకు రూ. 5 లక్షలు, గొర్లె ధర్మవరం పకాల ఇండ్ల దగ్గర బోర్‌వెల్ నిర్మాణానికి రూ.1.3 లక్షలు, గొర్లె ధర్మవరం కేశవమూర్తి అప్పలస్వామి ఇంటి వద్ద బోర్ వెల్ నిర్మాణానికి రూ.1.3 లక్షలు, మార్టూరు ఎస్సీ కాలనీలో బోర్‌వెల్ నిర్మాణానికి రూ.1.3 లక్షలు, జగ్గన్నపేటలో బోర్‌వెల్‌కు రూ.1.5 లక్షలు, చిప్పాడ(వైఎస్సార్ నగర్)లో బోర్‌వెల్ నిర్మాణానికి రూ.1.3 లక్షలు, కొండకర్ల అందలాపల్లి కమ్యూనిటీ హాల్ వద్ద బోర్‌వెల్ నిర్మాణానికి రూ.1.3 లక్షలు మంజూరయ్యాయి. అలాగే జెడ్పీటీసీ లాలం రాంబాబు కోటాలో కొండకర్ల శ్మశాన వాటికలో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.5 లక్షలు, మార్టూరు బీసీ కాలనీలో బోర్‌వెల్ నిర్మాణానికి రూ.1.5 లక్షలు, పెదపాడు కోన వరలక్ష్మి పాకల వద్ద బోర్‌వెల్‌కు రూ.1.5 లక్షలు, చీమలాపల్లిలో సీసీ డ్రైనేజీ నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరయ్యాయి.

చురుగ్గా సాగునీటి కాలువలు పూడికతీత పనులు



పూడికతీత తీయకముందు కాలువ దుస్థితి



పూడికతీత తీసిన తర్వాత సాగునీరు కాలువ

పాయకరావుపేట : మండలంలో పలు గ్రామాలకు సాగునీరు సరఫరా జరిగే సాగునీటి కాలువల పూడికతీత పనులు చురుగ్గా జరుగుతున్నాయి. తాండవ నది నుంచి ప్రవహించే నీరు ముఠా ఆనకట్ట, భూమి ఆనకట్టల ద్వారా ముఠా, భూమి కాలుల్లోకి ప్రవేశించి మండలంలో రైతుల భూములకు సాగునీరు సరఫరా జరుగుతుంది. ముఠా, రాజవరం, ఆవ, మంగవరం, గుంటపల్లి, భూమి కాలువ ద్వారా మండలంలో రైతులకు సాగునీరు సరఫరా జరుగుతుంది. కానీ రైతులకు పంట పొలాలకు సాగునీరు సరఫరా చేసే కాలువలు ఎంతో కాలంగా పూడికతీతకు నోచుకోకపోవడం వల్ల పొలాలకు సాగునీరు సక్రమంగా సరఫరా కావడం లేదు. ఈ నేపథ్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పలు గ్రామాల రైతుల సాగునీటి కాలువల దుస్థితిని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు వివరించారు. దీంతో ఎమ్మెల్యే స్పందించి మండలంలో కేశవరం వద్ద నున్న డెక్కన్ ఫైన్ కెమికల్స్ కంపెనీ యాజమాన్యంతో ఫోన్‌లో మాట్లాడారు. కాలువ పూడికతీతకు సహకరించాలని చెప్పడంతో కంపెనీ యాజమాన్యం స్పందించి పొక్లెయిన్‌తో సాగునీటి కాలువ పూడిక తీత పనులు చేపట్టారు. సత్యవరం, మాసాహెబుపేట గ్రామాలకు సాగునీరు సరఫరా కాలువ, అదే విధంగా ముఠా కాలువ పూడికతీత పనులు చేపట్టారు. ఆయా గ్రామాలకు సాగునీరు సరఫరా జరుగుతుంది. అదే విధంగా మంగవరం, ఆవ, గుంటపల్లి కాలువలు కూడా పూడికతీత పనులు చురుగ్గా చేపడుతున్నారు. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వెంకన్న ఆలయానికి భక్తుల తాకిడి



సహస్రావధాని లక్ష్మీ నరసింహం దంపతులకు తీర్థప్రసాదాలు అందజేస్తున్న అర్చకులు

నక్కపల్లి : శ్రావణమాసం శనివారం, బహుళ దశమి కావడంతో ఉపమాక వెంకన్న ఆలయానికి భక్తులు తాకిడి ఎక్కువగా ఉంది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి కొండపై కల్కి అవతారంలో వెలసిన మూలవిరాట్‌ను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చక స్వాములు స్వామివారికి పంచామృతాభిషేకం అర్చనలు, నిత్య కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. ప్రముఖ సహస్రావధాని కోట లక్ష్మి వేంకట నరసింహం దంపతులు స్వామివారిని దర్శించుకున్నారు. ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాద్ స్వామివారి క్షేత్ర మహత్మ్యాన్ని, విశిష్టతలను వివరించారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.

లోక్ ఆదాలత్‌లో 1700 కేసుల పరిష్కారం

యలమంచిలి : జాతీయ లోక్ ఆదాలత్‌లో భాగంగా యలమంచిలి కోర్టులో 1700 కేసులు పరిష్కారమైనట్టు యలమంచిలి సీనియర్ సివిల్ జడ్జ్ ఎ. సాయికుమారి శనివారం సాయంత్రం తెలిపారు. సివిల్‌కు సంబంధించిన కేసులు, క్రిమినల్ కేసులు రాజీతో పరిష్కరింపబడ్డాయని, కేసులకు సంబంధించి చెల్లించిన నగదును కక్షిదారులకు అందజేయడమైనదని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు సీనియర్ సివిల్ జడ్జి వీర రాఘవేంద్రరావు, లోక్ అదాలత్ సిబ్బంది, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఆలస్యంగా ఖరీఫ్ వరినాట్లు


వర్షాలతో దమ్ములకు సిద్ధమవుతున్న రైతులు



వర్షాలకు పంట భూముల్లో చేరిన నీరు



రోలుగుంటలో ముదిరిన వరి ఆకు



కొత్త మల్లంపేట మెరక ప్రాంతాల్లో నాట్లు వేస్తున్న కూలీలు

రోలుగుంట: నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పంట భూముల్లోను, చెరువుల్లోనూ నీరు చేరుతోంది. దీంతో మండలం రైతాంగం వరి నాట్లు వేసేందుకు సన్నద్ధమవుతున్నారు. వర్షభావ మండలం కావడంతో ఇప్పటి వరకూ భూముల్లో పదును లేక చెరువుల్లో నీరు చేరక ఖరీఫ్ వరిసాగు పనులు ఆలస్యమయ్యాయి. వాస్తవంగా మండలంలో 1,340 హెక్టార్లలో ఖరీఫ్ వరినాట్లు వేయాల్సి ఉంది. ఆయకట్టు చెరువుల వద్ద అనుకూలంగా ఉన్న భూముల్లోను, సాగునీరు అవకాశం ఉన్న కొమరవోలు ఆవ ప్రాంత పల్లపు భూముల్లోను, శరభవరం మల్లమ్మ చెరువు, బుచ్చింపేట పెదచెరువు తదితర ప్రాంతాల్లో ఇప్పటి వరకు 20 శాతం మాత్రమే నాట్లు పడ్డాయి. సాగునీటి వసతి లేక, అనుకూల వర్షాలు లేక వరి నారుమడులు సైతం ఎండిపోయిన పరిస్థితుల నుంచి మోటారు ద్వారా నీటి తడులు వేసుకుని సంరక్షించుకున్నారు. వరినాట్లపై రైతాంగం కలవరం చెందుతున్న నేపథ్యంలో మూడు రోజులుగా వర్షాలు పడి సాగుకు అనుకూలం ఏర్పడింది. దీంతో మండల వ్యవసాయ శాఖ అధికారుల సూచనలతో దమ్ములకు కొండపాలెం, రోలుగుంట ఆవ సమీపంలోను, కొవ్వూరు చెరువు ప్రాంతంలోను సిద్ధమవుతున్నారు.

మెరక ప్రాంతాల్లో వరినాట్లు

గొలుగొండ: ఇటీవల నాలుగు రోజులు నుంచి కురుస్తున్న వర్షాలకు మెట్ట ప్రాంతాల్లో వరినాట్లు వేయడంలో రైతులు బిజీబిజీగా ఉన్నారు. వర్షాలు సరిగా లేకపోవడతో కొత్తమల్లంపేట, చిన్నయ్యపాలెం, దారపాలెం, నిమ్మగెడ్డ ప్రాంతాల్లోని మెరక భూముల్లో నాట్లు వేయలేదు. ఈ నేపథ్యంలో నాలుగు రోజులు నుంచి కురుస్తున్న వర్షాలతో ప్రస్తుతం నాట్లు వేస్తున్నారు. నాట్లు ఆలస్యం కావడంతో కాస్త దిగుబడులు తగ్గుతాయని రైతులు వాపోతున్నారు.

అక్రమాల్లో చంద్రబాబు 'స్కిల్'కు నిదర్శనం



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ కాకర దేవి



మాట్లాడుతున్న క్రిస్టియన్ మైనారిటీ సెల్ సభ్యులు

ఎస్.రాయవరం : చంద్రబాబు అధికారంలోకి వచ్చాకే అనేక అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని జెడ్పీటీసీ సభ్యులు కాకర దేవి అన్నారు. కొరుప్రోలు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కీంలో చంద్రబాబు అవినీతిపై ఆధారాలు పక్కాగా ఉండడం వల్లే పోలీసులు అరెస్టు చేశారని, మాజీ సీఎం అయినంత మాత్రాన అరెస్టు చేయకూడదా? అని తెలుగు తమ్ముళ్లను ప్రశ్నించారు. నక్కపల్లి మండల పార్టీ అధ్యక్షుడు సీరం నరసింహమూర్తి, ఎస్.రాయవరం వైస్ ఎంపీపీ చోడిపల్లి గోవిందు, పెదఉప్పలం సర్పంచ్ కోశెట్టి వెంకటరమణ తదితరులు చంద్రబాబు, టీడీపీ నేతల అవినీతిపై విరుచుకుపడ్డారు. ఈ సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు పోలిశెట్టి పెద ఈశ్వరరావు, అద్దేపల్లి నూకునాయుడు, పెనుగొల్లు పీఏసీఎస్ చైర్ పర్సన్ దోసపాత్రుని హనుమంతరావు,శేషారత్నం, తాతబాబు, సత్యనారాయణ, సందీప్ ఉన్నారు.

చంద్రబాబు అరెస్టు సబబే

అచ్యుతాపురం(అనకాపల్లి): అవినీతి కేసులో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడ్ని అరెస్టు చేయడాన్ని రాష్ట్ర ప్రజలు స్వాగతిస్తున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ద్వారపురెడ్డి బాబ్జి అన్నారు. అచ్యుతాపురంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కొరుప్రోలు చిన్నారావు మాట్లాడుతూ చంద్రబాబు వ్యవస్థల్ని మేనేజ్ చేసి ఇన్నాళ్లూ చట్టం నుంచి తప్పించుకుంటున్నారని తెలిపారు. చంద్రబాబు అవినీతిపై ప్రశ్నించకుండా పెద్దల్ని, సీఎంని ఇష్టమొచ్చినట్టు తిడుతూ ఓవరాక్షన్ చేస్తున్న పవన్‌కళ్యాణ్‌కూ ఇటువంటి గతే పడుతుందని హెచ్చరించారు.

నిరుద్యోగులను ముంచేసిన పాపమే...

యలమంచిలి : మీ పాపము మిమ్మల్నే పట్టుకుంటుంది అన్నమాట అక్షరాలా మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విషయంలో రుజువైందని అనకాపల్లి జిల్లా వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనారిటీ సెల్ అధ్యక్షుడు మేకల సుధీర్‌కుమార్ అన్నారు. శనివారం యలమంచిలిలో క్రిస్టియన్ మైనారిటీ సెల్ సభ్యులతో కలసి ఆయన సమావేశంలో మాట్లాడారు. స్కిల్ డెవలప్‌మెంట్ ఇండియాలో రూ. 371 కోట్ల కుంభకోణానికి ప్రధాన సూత్రధారి, లబ్ధిదారుడు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అని నిర్ధారించి సీఐడీ బృందం అరెస్టు చేసిందని అన్నారు. దీనికి రాజకీయ రంగు పులమడానికి టీడీపీ నాయకులు ప్రయత్నించడం హేయమైన చర్య అన్నారు. ఈ కుంభకోణం రాష్ట్ర అభ్యున్నతికే తూట్లు పొడిచే ఘోరమైన నేరమని అన్నారు. సమావేశంలో వైఎస్ఆర్‌సీపీ యలమంచిలి మండల క్రిస్టియన్ మైనారిటీ సెల్ అధ్యక్షుడు పీటర్, యలమంచిలి క్రిస్టియన్ మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి, యలమంచిలి సోషల్ మీడియా మండల కన్వీనర్ విజయ్‌కుమార్, బి.జేమ్స్, డేవిడ్‌రాజ్, ఐజాక్ పాల్గొన్నారు.

చట్టం అందరికీ సమానమే

కోటవురట్ల: చట్టాలకు ఎవరూ అతీతులు కారని, అవినీతికి పాల్పడిన మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చట్టాల నుంచి తప్పించుకోలేరని మండల వైఎస్సార్‌సీపీ పార్టీ అధ్యక్షుడు కిల్లాడ శ్రీనువాసరావు తెలిపారు. ఆయనతోపాటు మండల నాయకులు మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో కోట్లాది రుపాయలు దోచుకున్న చంద్రబాబును పోలీసులు అరెస్టు చేయడాన్ని కక్ష సాధింపు చర్యగా టీడీపీ నేతలు హడావుడి చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఎంపీటీసీ సభ్యులు పెట్ల రాంబాబు, వి.రాంబాబు, సర్పంచ్‌లు గోపాలకృష్ణ, వరహాలబాబు, పార్టీ నాయకులు బాబ్జి, గోవింద్, నానిబాబు పాల్గొన్నారు.

వాసవీ కన్యకాపరమేశ్వరికి ప్రత్యేక పూజలు

జంపెనలో అమ్మవారికి నోట్లతో అలంకరణ



వాసవీమాతకు పూజలు చేస్తున్న ఆలయ కమిటీ అధ్యక్షుడు మోహన్‌రావు దంపతులు



నోట్ల అలంకరణలో అమ్మవారు

మాడుగుల రూరల్: శ్రావణమాసం సందర్భంగా జంపెనలో వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో శనివారం ప్రత్యేక కుంకుమార్చన, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు పుట్టా మోహన్‌రావు ఆధ్వర్యంలో 40 ఏళ్లు దాటిన వారికి పాదపూజ చేశారు. అన్నసమారాధన ఏర్పాటు చేశారు. గ్రామస్తులతోపాటు చుట్టు పక్కల గ్రామాలకు చెందిన రెండు వేల మంది భక్తులు హాజరై అన్నప్రసాదం స్వీకరించారు. ఈ సందర్భంగా అమ్మవారిని కరెన్సీ నోట్లతో అలంకరించారు. కింతలి–గాదిరాయి వాసవీ క్లబ్ అధ్యక్షుడు మేడిశెట్టి అర్జునరావు, ఆలయ కమిటీ అధ్యక్షుడు మోహన్‌రావు, రీజనల్ చైర్మన్ ఆనపగడ్డ హరిబాబు, జోన్ చైర్మన్ శ్రీనాథు కన్నయ్యశెట్టి, కార్యదర్శి ఆనపగడ్డ చిన్నయ్య, కోశాధికారి పుట్టా కొండలరావు, శ్రీనాథు సతీశ్, బత్తుల సత్యారావు, పచ్చికూర శ్రీరామమూర్తి, పి.నాగరాజు, పైడిరాజు, శ్రీరామమూర్తి, రావల బ్రదర్స్, ఆనపగడ్డ సోదరులతోపాటు వాసవీ క్లబ్ సభ్యులు, వనితా క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన పాల వ్యాన్

తప్పిన ప్రమాదం



పాల వ్యాన్ ఢీకొట్టడంతో నేలకూలిన విద్యుత్ స్తంభం

బుచ్చెయ్యపేట: పాల వ్యాన్ అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. శనివారం ఉదయం బుచ్చెయ్యపేట బల్క్ మిల్క్ కేంద్రం వద్దకు వస్తున్న విశాఖ డెయిరీ పాల వ్యాన్ అదుపుతప్పి పక్కనున్న స్తంభాన్ని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో స్తంభం విరిగిపోయి నేలకూలింది. ఎవరికీ ఎటువంటి ప్రమాదం కాలేదు. స్థానికులు విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించి సరఫరా నిలిపివేశారు. ఆ శాఖ అధికారులు వచ్చి విరిగిన స్తంభాన్ని తొలగించి కొత్తది ఏర్పాటు చేసి తిరిగి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

నేడు వినాయక విగ్రహ ప్రతిష్ట



పూజల కోసం పనులు చేయిస్తున్న సంఘ సభ్యులు

రోలుగుంట: ఈ నెల 18న వినాయక చవితి పురస్కరించుకుని నవరాత్రోత్సవాల కోసం స్థానిక జీవకారుణ్య సంఘం భవనం వద్ద జీవకారుణ్య సంఘం, అనుబంధ సిద్ధి వినాయక సంఘ సభ్యులు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. దీనిలో భాగంగా ఇక్కడ భవనంలో వినాయకుడిని ఆదివారం ప్రతిష్టించేందుకు సభ్యులు నిర్ణయించారు. ఈ మేరకు శుక్ర, శని వారాలు సంఘ సభ్యులు తమరాన సతీష్, ఆడారి గణేష్ చోప్రా తదితరులు శ్రమదానంతో అవసరమైన పనులు చేశారు. నేడు జరగనున్న పూజా కార్యక్రమాలకు సంఘ సభ్యులందరూ విధిగా పాల్గొనాలని వారు కోరారు.

మంచినీటి ట్యాంకు నిర్మాణానికి భూమిపూజ

రావికమతం: డోలవానిపాలెంలో 20వేల లీటర్ల సామర్థ్యం కలిగిన మంచినీటి ట్యాంకు నిర్మాణానికి వైస్ ఎంపీపీ మత్స భవానీప్రసాద్ శనివారం భూమిపూజ చేశారు. టి.అర్జాపురం శివారు గ్రామమైన డోలవానిపాలెంలో ఇంటింటికీ కుళాయిల ఏర్పాటుకు విప్ కరణం ధర్మశ్రీ రూ.29.99 లక్షలు మంజూరు చేయించారు. ఇక్కడ తాగునీటి పైపు లైన్లు ఏర్పాటుతోపాటు 20 వేల లీటర్ల ట్యాంకు నిర్మించనున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఇల్లపు సన్యాసి నాయుడు, రాముునాయుడు, రమేష్‌నాయుడు, రమణ తెలిపారు.

బీజేపీ విశాఖ జిల్లా ఇన్‌చార్జిగా పుట్టా గంగయ్య

మాడుగుల రూరల్: బీజేపీ సీనియర్ నాయకుడు పుట్టా గంగయ్య విశాఖ జిల్లా ఇన్‌చార్జిగా నియమించారు. ఇప్పటికే ఆయన ఈ పదవిలో కొనసాగుతున్నప్పటికీ పార్టీ నూతన రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి తిరిగి అన్ని జిల్లాల అధ్యక్షులను పునర్నియమించారు. దీనిలో భాగంగా జిల్లా ఇన్‌చార్జిగా తనను నియమించినట్లు మాడుగులలో ఆయన శనివారం తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈయన సీనియారిటీని గుర్తించి పార్టీ విశాఖ జిల్లా ఇన్‌చార్జిగా కొనసాగించడంపై మాడుగుల నియోజకవర్గ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రైవేటు భవనంలోకి ఒమ్మలి పీఏసీఎస్ తరలింపు



భవనం ప్రారంభోత్సవంలో సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి భాస్కరరావు

మాడుగుల రూరల్: ఒమ్మలి పీఏసీఎస్ భవనం శిథిలావస్థకు చేరడంతో ప్రైవేటు భవనంలోకి శనివారం తరలించారు. ఈ భవనంలో సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి బొడ్డాపు భాస్కరరావు కొబ్బరికాయ ప్రారంభించారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు పర్రె రామునాయుడు, సీఈవో నందారపు వెంకటరమణ, వార్డు సభ్యులతోపాటు పూసర్ల బుజ్జి, దొర పాల్గొన్నారు.